
నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 19 ఆగస్టు 2024 | NALGONDA

## అనుబంధాల వేడుక రాఖీ

• నేడు రక్షాబంధన్

రామగిరి, ఆగస్టు 17 : అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, అనురాగానికి ప్రతీక రాఖీ. నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆడబిడ్డలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు అందిస్తారు. పండుగ సందర్భంగా మార్కెట్లలో రాఖీ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక స్వీట్ల దుకాణాల్లోనూ కొనుగోళ్ల సందడి కనిపించింది.


నల్లగొండలో రాఖీలు కొంటున్న మహిళలు


సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ బీమా చెక్కులను అందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# రుణమాఫీ ఆగమాగం

## వచ్చిన వారికి సరే.. రానివారిపై నో క్లారిటీ

• నల్లగొండ మండలం రెడ్డికాలనీలో 189 మందిలో 118 మందికే మాఫీ
• మిగిలిన రైతులకు ఎగ్గొట్టే ప్రయత్నం
• 365 మంది ఓటర్లు ఉన్న ఈ చిన్నగ్రామంలోనే ఇంత తేడా
• వచ్చేదాకా ఏం చెప్పలేమంటున్న బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు

నల్లగొండ, ఆగస్టు 18 : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలోని నల్లగొండ మండలం రెడ్డి కాలనీ అతిచిన్న గ్రామం. 365 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామ పరిధిలో బట్టబోతుల గూడెం ఉంటుంది. ఇక్కడ పూర్తిగా వ్యవసాయ మీద ఆధారపడిన వారే ఎక్కువ.

గత ఎన్నికల ముందు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుతోపాటు పీఏసీఎస్‌లలో 189 మంది రైతులు సుమారు రూ.1.07 కోట్ల పంట రుణం తీసుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడుతలుగా ప్రకటించిన రుణమాఫీలో 118 మంది రైతులకు రూ.87.70 లక్షల రుణమాఫీ జరిగినట్లు తెలుస్తుంది. పలు కారణాలతో మరో 71 మంది రైతులకు రూ.56.33 లక్షల రుణమాఫీ కాలేదు. ఇందులో ఐఓబీ నుంచి 163 మంది, పీఏసీఎస్ నుంచి 26 మంది రైతులు రుణం తీసుకున్నట్లు సమాచారం. గత రెండు విడుతలుగా రైతులను మభ్యపెట్టిన కాంగ్రెస్ సర్కారు మూడో విడుతలో కూడా మాఫీ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న గ్రామాల్లో ఇంత తేడా రుణమాఫీ జరుగుతుంటే పెద్ద గ్రామాలకు చెందిన రైతుల పరిస్థితి ఏంటనేది ప్రశ్న. ఈ విషయంపై ప్రభుత్వంతోపాటు వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు నోరుమెదపకుండా ఒకరిమీద ఒకరు నెట్టేసుకొని కాలం గడుపుతున్నారు.


నల్లగొండ మండలంలోని రెడ్డి కాలనీ వ్యూ

### పలు కారణాలతో తిరస్కరణ..

రైతుల్లో ఇప్పటి వరకు జాబితా ఉన్న వారికే రుణమాఫీ వచ్చింది తప్ప ఇతరులకు వచ్చే అవకాశం చాలా తక్కువ అని పలువురు వ్యవసాయ అధికారులు అంటున్నారు. రాని వారు తమ దగ్గరకు వస్తే సరైన కారణం కూడా వెబ్‌సైట్‌లో ఉండటం లేదనేదే వారు చెబుతున్న విషయం. కుటుంబ సభ్యుల వివరాలు లేవు, ఆధార్, బ్యాంకులో పేర్లు వేరేగా ఉన్నాయి, ఆధార్ కార్డు నంబర్ ఒకే కుటుంబంలో అందరికీ ఒకే నంబర్ కనిపిస్తుంది.. అనే కారణాల కనిపిస్తున్నాయి.

### సూర్యాపేట జిల్లాలో గ్రామానికి సగటున 71 మందికే రుణమాఫీ

సూర్యాపేట, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : రేవంత్ సర్కారు చేసిన రుణమాఫీ ఇంకా చాలా మంది రైతులకు కాలేదు. దాంతో రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు, 932 ఆవాసాలు కలిపి 1,418 ఉన్నాయి. మూడు విడుతలు కలిపి రుణమాఫీ అయిన రైతుల సంఖ్య 1,00,583 మంది. ఈ లెక్కన సగటున ఒక్కో ఊరికి 71 మంది రైతులకే రుణమాఫీ అయ్యింది. జిల్లాలో తొలి విడుతగా రూ.లక్ష లోపు 56,217 మంది రైతులకు రూ.282.98 కోట్లు, రెండో విడుతలో 26,437 మందికి రూ.250 కోట్లు, మూడో విడుతలో 17,870 మందికి రూ. 305 కోట్లు మాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మూడు విడుతలు కలిపి 1,00,583 మంది రైతులకు మొత్తం రూ.837 కోట్టే మాఫీ అవుతున్నది. వాస్తవానికి జిల్లాలో సుమారు 2.35 లక్షల మంది రైతులకు రూ.రెండు లక్షల లోపు రుణాలు దాదాపు రూ.3వేల కోట్ల వరకు ఉంటుంది. ఈ లెక్కన రుణమాఫీ అయ్యింది కొద్ది మందికి మాత్రమే అనేది తెలుస్తున్నది. నేడు ఏ గ్రామానికి వెళ్లి రుణమాఫీ అయిందా అని రైతులను ప్రశ్నిస్తే కొద్ది మంది మాత్రమే అయ్యిందని చెబుతున్నారు. చాలా మందికి రాలేదని, అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని అంటున్నారు. ఒకవేళ రుణమాఫీ చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం భరతం పడుతామని హెచ్చరిస్తున్నారు.

### రూ.54వేలు కూడా మాఫీ కాలేదు



నాకు మా గ్రామంలో 1.16ఎకరాల భూమి ఉంటే దానికి సంబంధించిన పాస్ బుక్ పెట్టి నల్లగొండలోని ఐఓబీలో రూ.54 వేలు పంట రుణం తీసుకున్నాం. మొదటి విడుతలోనే మాఫీ అవుద్ది అన్నారు. అప్పుడు లిస్ట్‌లో పేరు కూడా వచ్చింది. కానీ మాఫీ కాలేదు. అదేంటని బ్యాంకుకు వెళ్లి అడిగితే ఐడీ నంబర్ తప్పు పడింది, అందుకే రాలేదు, అదే వస్తది పో అని వెళ్లగొట్టారు.

– సుంకరబోయిన యాదయ్య, రెడ్డి కాలనీ, నల్లగొండ

### అధికారులు ఏం చెప్పడం లేదు



నేను 2.26 ఎకరాలకు సంబంధించిన పాస్ బుక్‌లు పెట్టి రూ.1.60లక్షల పంట రుణం తీసుకున్నా. చివరి విడుతలో అవుద్ది అనుకుంటే కాలేదు. బ్యాంకుకు వెళ్లే మాకు వచ్చేవరకు తెల్వదు అంటుండ్రు. వ్యవసాయ అధికారులను అడిగితే బ్యాంకులో అడుగమంటున్నరు.

–జిన్నె వెంకట్ రెడ్డి, రెడ్డి కాలనీ, నల్లగొండ మండలం

### మా దగ్గర మాఫీ అయిన జాబితానే ఉంటుంది

మూడు లిస్టులకు సంబంధించి మా దగ్గర ఎంత మంది రైతులకు మాఫీ అయిందో డేటా వచ్చింది. కానీ ఏ రైతుకు ఎంత అయిందో, ఎవరికి కాలేదో అనే జాబితా మాత్రం రాలేదు. ఎంత రుణం తీసుకున్నారు అనేది కూడా బ్యాంకర్ల దగ్గర ఉంటుంది. రాని వాళ్లు దరఖాస్తు చేసుకుంటే నోడల్ అధికారులుగా ఉన్న నేను వెరిఫై చేసి సరి చేసి ప్రభుత్వానికి పంపిస్తా.

–శ్రీనివాస్, ఏఓ, నల్లగొండ

### ఫైనల్ డేటా వచ్చేదాక చెప్పలేం

మా దగ్గర ఎంత మంది రైతులు రుణం తీసుకున్నారు అనే జాబితా ఉండదు. అది డైరెక్ట్‌గా హెడ్ ఆఫీస్ నుండే ప్రభుత్వానికి వెళ్తుంది. మూడు విడుతల్లో మాఫీ పూర్తిగా అయిన తర్వాత ఎంతమందికి ఫైనల్‌గా మాఫీ అయిందనే డేటా వస్తుంది. ఇప్పుడు ఎవరికి ఎందుకు రాలేదనేది మాత్రం చెప్పలేం.

–సుధీర్, ఫీల్డ్ ఆఫీసర్, ఐఓబీ నల్లగొండ

## బీఆర్ఎస్ సభ్యత్వ బీమా.. కార్యకర్తలకు ధీమా

• మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ సంచలనాత్మకాలే..
• మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 18 : పార్టీని నమ్ముకున్న కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామని.. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమాతో వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ సంచలనాలేనన్నారు. సుమారు 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, పదేండ్ల పాలనలోనే అన్ని రంగాల అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాల్లో తెలంగాణను యావత్ దేశానికే ఆదర్శంగా నిలిపారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రశాంత వాతావరణం కల్పించామని, అన్ని వర్గాల వారికి అండగా నిలిచామని చెప్పారు. ఈ సందర్భంగా సూర్యాపేట నియోజకవర్గంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన అనసూర్య, అక్కలదేవి గూడెం గ్రామానికి చెందిన పుట్ట సుజాత, లక్ష్మి, రాయినిగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌కు రూ. 2లక్షల చొప్పున పార్టీ సభ్యత్వ బీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు తూడి నర్సింహా రావు, నాయకులు మర్ల చంద్రారెడ్డి, జూలకంటి సుధాకర్ రెడ్డి, జూలకంటి జీవన్ రెడ్డి, గురవింద్ గౌడ్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.


అగ్రి షో ముగింపులో భాగంగా మెమెంటోలు అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పక్కన రైతుబడి నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డి

## అగ్రి షో సక్సెస్

• తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు రాక
• వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక టెక్నాలజీని వివరించిన వివిధ కంపెనీలు
• వ్యవసాయ రంగంలో వస్తున్న టెక్నాలజీని రైతాంగానికి అందించాలి
• రైతుబడి అగ్రి షో ముగింపు కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా

నీలగిరి, ఆగస్టు 18 : రైతుబడి అధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల అవరణలో రెండు రోజులపాటు నిర్వహించిన అగ్రి షో సక్సెస్ అయ్యింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వివిధ కంపెనీ ప్రతినిధులు, ఏజెన్సీ నిర్వాహకులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపొందించిన ఆధునిక యంత్రాలు, పరికరాలతోపాటు ప్రకృతిపరంగా తయారయ్యే కంపోస్టులను సుమారు వందకుపైగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో రైతులకు పరిచయం చేశారు. సుమారు 30వేల మందికిపైగా రైతులు ఈ కార్యక్రమంలో వ్యవసాయంలో కొత్త పద్ధతులు, యంత్రాల వినియోగం గురించి తెలుసుకున్నారు. ముగింపు సందర్భంగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని భాగస్వాములకు మెమెంటోలు అందించారు. నిర్వాహకుడు రాజేందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ వ్యవసాయ రంగం దండుగ అనే నానుడి నుంచి పండుగ అని కోట్లాది మంది రైతులు దానిని ఉపాధిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను పెంపొందించుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం వ్యవసాయ రంగంపైపు కదులుతున్నారని తెలిపారు. వ్యవసాయం అనేది అంతటా ఒకేలా ఉండదని, ప్రతి ఒక్కరూ కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఇలాంటి అగ్రి షోలను ద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ ఖయ్యూంబేగ్, యామా కవితారాణీదయాకర్, నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


నల్లగొండ కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, తదితరులు

## సర్వాయి పాపన్నకు నివాళి

నల్లగొండ రూరల్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. పాపన్న జయంతిని పురస్కరించుకొని అదివారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టి కుల వృత్తిని చేసుకుంటూ ఆనాడు కొంతమంది బడుగు, బలహీన వర్గాలపై చేసే ఆరాచకాలకు ఎదురొడ్డి నిలబడిన సాహస వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు. తన శక్తియుక్తులతో వీర సైనికుడులా మారి అన్యాయాలు, అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పెద్ద సైన్యాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్, గౌడ సంఘం, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సుంకిశాల ఘటనపై విజిలెన్స్ విచారణ

• సంఘటన ప్రదేశాన్ని సందర్శించిన అధికారులు

పెద్దవూర ఆగస్టు 18 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన ఘటనపై విచారణ చేపట్టేందుకు ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఘటనకు గల కారణాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఇంత ప్రమాదం జరిగినా తమ దృష్టికి రాలేదని, సోషల్ మీడియా, మీడియా చానెల్ ద్వారానే వివరాలు తెలుసుకున్నామని వారు అక్కడి అధికారులతో తెలిపారు. ఈ నష్టం ఎంత మొత్తంలో ఉంది దీనికి కారణం ఎవరనే విషయల పై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘటన ఈ నెల 2న జరిగినా తమకు ఈ మధ్యనే తెలిసిందని, దీనిపై పూర్తి దర్యాప్తు చేసిన తర్వాత తదుపరి వివరాలు వెల్లడిస్తామన్నారు. సందర్శించిన వారిలో అడిషనల్ ఎస్పీ ఆనంద్‌కుమార్, డిప్యూటీ ఇంజినీరింగ్ బాలకృష్ణ , ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పెద్దవూర మండలం సుంకిశాలలో ప్రాజెక్టును సందర్శించి వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సభ్యులు

## ఆరోగ్య సేవల ఫిర్యాదు కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్

• 18004251442 నంబర్‌కు ఫోన్ చేయాలి : అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ సిటీ, ఆగస్టు 18 : జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఆరోగ్య సేవల ఫిర్యాదుల నమోదుకు కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్ సెంటర్ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని, ఫిర్యాదులకు 18004251442 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. కాల్ సెంటర్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదులను నమోదు చేసుకొని సంబంధిత దవాఖాన పరిపాలనాధికారులకు తెలియజేస్తారని తెలిపారు. గర్భిణులు, ప్రసూతి, డెంగ్యూ, విషజ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందకపోతే కాల్ సెంటర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రులో 24 గంటల ప్రసూతి సేవలు ప్రారంభించినట్లు చెప్పారు.

## గోడ కూలి చిన్నారి మృతి

• మరొకరికి తీవ్ర గాయాలు

సూర్యాపేట, ఆగస్టు 18(ఆత్మకూర్.ఎస్) : ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై గోడ కూలగా ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్ గ్రామంలోని దండు మైసమ్మ ఆలయం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దండు మైసమ్మ ఆలయ సమీపంలో చౌట చెరువు నుంచి వచ్చే వాగుపై నిర్మించిన కల్వర్టుపై కొంత మంది షెడ్లు ఏర్పాటు చేసుకొని షాపులు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బిజిగే అనిత కల్వర్టుపై ఏర్పాటు చేసుకున్న షెడ్డుకు ప్రహరీ గోడ ఏర్పాటు చేసుకుంది. దాని పక్కనే తుమ్మల పెన్‌పహాడ్‌కు చెందిన పోరెళ్ల రామస్వామి దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అనిత ఇంటి గోడ కూలి రామస్వామి ఇంట్లో ఆడుకుంటున్న ఆయన కుమారులు దేవాన్ష్(5), హిమాన్ష్(3)పై పడింది. దాంతో చిన్న కుమారుడు హిమాన్ష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందా డు. పెద్ద కుమారుడు దేవాన్ష్‌కు కూడా తీవ్ర గాయాలు కాగా అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. తల్లి పోరెళ్ల సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


కూలిన గోడ


హిమాన్ష్, దేవాన్ష్ (ఫైల్)


నల్లగొండలో అగ్రి షోను సందర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత చాడ కిషన్‌రెడ్డి

## ఆధునిక పద్ధతులు వచ్చాకే వృత్తుల్లో మార్పులు


• వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ ఒక మోసపూరిత కార్యక్రమమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో రైతుబడి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. సుమారు రెండు గంటలపాటు స్టాళ్లను తిరిగి వ్యవసాయ ఉత్పత్తులు, సాంకేతిక పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రిషోలను విశ్వవిద్యాలయాలు చేయాలని, అందుకు ప్రభుత్వం సహకారం అందించాలని అన్నారు. మార్పులకు అనుగుణంగా సాంకేతికను వినియోగిస్తూ కొత్తపంథాను అనుసరించాలని రైతాంగానికి సూచించారు. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తికి చాలా డిమాండ్ పెరిగిందని, ఇలాంటి లాభదాయకమైన వాటిపై దృష్టి సారించాలన్నారు. దేశంలో రైతులకు ఇది ఇచ్చాం, అది ఇచ్చాం అనే గొప్పలు చెప్పకుండా వ్యవసాయం రంగాన్ని పరిశ్రమగా తీసుకున్న ప్రభుత్వాలే భవిష్యత్‌లో ప్రజాదరణ పొందుతాయని చెప్పారు. అందరూ లాభాల కోసమే పనిచేస్తుంటారు కానీ అంతిమంగా తినడానికి తిండి అవసరమని, వెయ్యి రూపాయలు పెట్టి కొత్తిమీర, పదివేలు పెట్టి అలుగడ్డలు, ఉల్లిగడ్డలు కొనే దుస్థితి రావద్దని అన్నారు. ఎవరు ఎన్ని లక్షలు సంపాదించినా సక్రమంగా పంటలు పండించకపోతే, గిట్టుబాటు ధర రాకపోతే రైతులు ఆ రంగాన్ని వదలేసే పరిస్థితి ఉంటుందని, మానవ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు. అగ్రి షోను నల్లగొండలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా పెట్టాలని సూచించారు.

## రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

• డ్యామ్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకుల రాక

నందికొండ, ఆగస్టు 18 : శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో కొనసాతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 24,920, ఎడమ కాల్వ ద్వారా 6,791, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151, వరద కాల్వ ద్వారా 600, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. శ్రీశైలం నుంచి 71,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో సాగర్‌కు అంతే మొత్తంలో అవుట్‌ఫ్లోను కొనసాగిస్తున్నారు. తెలంగాణ టూరిజం కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన లాంచీలో నాగార్జున కొండకు, జాలీ ట్రిప్పులకు వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి కనపరిచారు. నల్లమల అడవుల మధ్య లాంచీ ప్రయాణం బాగుందని పర్యాటకులు తెలిపారు. నదీ తీరంలో పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ, లాంచీస్టేషన్ పరిసరాల్లో భోజనాలు చేస్తూ సరదాగా గడిపారు. సాగర్ డ్యామ్, లాంచీ స్టేషన్, బుద్ధవనం పరిసరాలు జనంతో కిటకిటలాడాయి.


నాగార్జునసాగర్ డ్యామ్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి వస్తున్న పర్యాటకులు

## సాగర్ నీటిని వృథా చేయకుండా చెరువులు నింపాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఆగస్టు 18 : నాగార్జున సాగర్ నీటిని వృథాగా గేట్ల ద్వారా వదలకుండా జిల్లాలోని అన్ని చెరువులు నింపాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వానికి సూచించారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో ఆదివారం విలేకరు సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల రెండు నుంచి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా వరద నీరు వస్తుండగా అధికారులు గేట్ల ద్వారా దిగువకు వదిలి నీటిని వృథా చేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై తాము ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా అదే తరహాలోనే నీటిని వృథా చేస్తున్నారని తెలిపారు. సాగర్‌కు వచ్చిన నీటితో నల్లగొండ జిల్లాలోని అన్ని చెరువులను కాల్వల ద్వారా నింపి కరువును నుంచి విముక్తి చేయాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. సాగర్ ప్రాజెక్టు నుంచి ఖమ్మం నీటిని తీసుకుపోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులకు సాధ్యమవుతుందని కానీ జిల్లాలో ఉన్నటువంటి ప్రాజెక్టులు, చెరువులను మాత్రం నింపి రైతులకు నీటి కష్టాలు లేకుండా చేయాలనే అలోచన ఆ పార్టీ నాయకులకు లేదన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

